ప్రజాశక్తి

మంగళవారం 9 జులై 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాసమస్యల పరిష్కారంలో

జాప్యం వద్దు..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. 89 అర్జీలు నమోదు కాగా, వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు. తన పరిధిలోని వాటిని తక్షణమే ఆయన పరిష్కరించగా, వీడియో సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. అర్జీలు పునరావతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తే కుదరదన్నారు. చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నీటి పన్నులు ఖచ్చితంగా వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులకు ఛార్జి మెమోలు జారీ చేయాలన్నారు.

అందుబాటులోకి ఇసుక

- నిల్వ కేంద్రాల్లో అమ్మకాలను ప్రారంభించిన మంత్రి డోలా
- ఒంగోలులో ఎంపీ, ఎమ్మెల్యే ఇసుక విక్రయాల ప్రారంభం
- రవాణా, సీనరేజీ పేరుతో టన్నుకు రూ.247 ధర నిర్ణయం

చతుకుపాడులో ఇసుక విక్రయాలను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టింది. సోమవారం నాడు జిల్లాలోని రెండు నిల్వల కేంద్రాల్లో ఉన్న ఇసుక అమ్మకాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఇసుక ఇప్పటికే రవాణా ఛార్జీలు, ఇతర ఖర్చులు భరించి తెచ్చినందున దానికి కొంత ధర పెట్టారు. నిల్వ ఉన్న ఇసుక వరకూ టన్నుకు రూ.247 నిర్ణయించారు. గతంలో టన్ను రూ.475 ఉంది. ప్రస్తుతం ఇసుక ధరను సగానికి సగం తగ్గించారు. కొంత ఊరట కలిగించే అంశమే. అదేవిధంగా రీచ్‌ల నుంచి సీనరేజీ కట్టుకుని ఉచితంగా తెచ్చుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నిల్వలను అమ్మకాలు చేస్తున్నారు. జరుగుమల్లి మండలం, చతుకుపాడులో మంత్రి డోలా వీరాంజనేయస్వామి అమ్మకాలను ప్రారంభించారు. ఒంగోలు మార్కెట్ యార్డులో ఉన్న నిల్వ కేంద్రంలోని ఇసుకను ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అమ్మకాలు ప్రారంభించారు. నిల్వ కేంద్రాల వద్ద ట్రాక్టర్లు, లారీలతో ఇసుక అవసరం ఉన్న నిర్మాణ దారులు పెద్దఎత్తున బారులు తీరారు. ప్రస్తుతం రీచ్‌లలో ఎక్కడా ఇసుక అందుబాటులో లేదు. ఈ రెండు చోట్లా 43 లక్షల టన్నుల ఇసుక నిల్వలున్నాయి. నిల్వ కేంద్రం నుంచి రవాణా ఛార్జీలు గతంలో మాదిరిగానే ఉంటాయి. వైసిపి ప్రభుత్వ ఇసుక విధానం వల్ల ధరలు భారీగా పెరగడమే కాకుండా మాఫియా చేతుల్లోకి చేరింది. ఎంత నియంత్రణ సాగినా ఇసుక అక్రమరవాణా పెద్దఎత్తున దొడ్డిదారిన సాగింది. పాలకపక్ష నేతలే రీచ్‌ల నుంచి తరలించారు. ట్రక్కు రూ.1500 నుంచి రూ.4 వేలకు చేరింది. లారీ ఇసుక రూ.10 వేల నుంచి రూ.30 వేలకు చేరింది. దీంతో నిర్మాణరంగంలో పెద్దఎత్తున సంక్షోభం తలెత్తింది. ఇసుక పెద్ద సవాలుగా మారింది. దీన్ని గమనించిన చంద్రబాబు ఎన్నికల్లో ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. జిల్లాలో ఇసుక విక్రయాలు ప్రారంభం కావడంతో భవనిర్మాణ కార్మికులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నిర్మాణాలకు అవసరమైన రైతులు, సామాన్యులు వాగులు, వంకల్లో అందుబాటులో ఉంటే పంచాయతీలకు సీనరేజీ చెల్లించి తెచ్చుకోవచ్చు. 2019 వరకూ తెలుగుదేశం ప్రభుత్వం ఇదే విధానాన్ని అమలు చేసింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక నిల్వలు చేసి అమ్మకాలు చేయడం వల్ల రవాణా ఛార్జీలు రెట్టింపయ్యాయి. అనివార్యంగా భారమైంది.

డ్యూటీలో ఉండే డాక్టర్ల

పేరు, ఫొటోల చార్ట్‌ను ఆసుపత్రిలో ఉంచాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు
- ప్రభుత్వ వైద్యులకు

కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరిక

పేషెంట్లతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-మార్కాపురం, మార్కాపురం రూరల్

ప్రభుత్వ వైద్యశాలలో డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ల పేర్లు, ఫోన్ నంబర్, ఫోటోలతో సహా చార్ట్ తయారుచేసి.. ఆసుపత్రిలో ఉంచాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సోమవారం ఆమె మార్కాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆమె ఇక్కడే ఉన్నారు. ఆసుపత్రిలోని సదుపాయాలను, ఔట్ పేషెంట్, కాన్పులు, చిన్నపిల్లల వార్డు, సదరం విభాగాలను, స్టాఫ్ కోసం వంట చేసే గదిని, మందుల గదిని పరిశీలించారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రికి రోజుకు సగటున ఎంతమంది వైద్యం కోసం వస్తున్నారు, వారిలో ఎంత మందిని ఒంగోలు జి.జి. హెచ్.కు రిఫర్ చేస్తున్నారు, తదితర వివరాలను ఆమె వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రోగులతోనూ ప్రత్యేకంగా ఆమె మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో సరిగా వైద్య సేవలు అందటం లేదని, ఎక్కువ కేసులను ఒంగోలుకు రెఫర్ చేస్తున్నారని, వైద్యులు కూడా డ్యూటీ సమయంలో పూర్తిస్థాయిలో ఆసుపత్రిలో అందుబాటులో ఉండటం లేదని 'మీకోసం' కార్యక్రమంలో ఫిర్యాదు రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా రోగులకు డైట్ కూడా మెనూ ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని చెప్పినట్లు తెలిపారు. ప్రతి కేసును కాకుండా అనివార్యమైన సందర్భంలోనే రోగులను ఒంగోలు జి.జి.హెచ్.కు రిఫర్ చేయాలని చెప్పానన్నారు. వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉంటుందని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించానని ఆమె తెలిపారు. ఈ ఆసుపత్రిని మొదటిసారి ▶ 2లో

కాపీ కొడుతున్నావా..?

రూ.500 ఇవ్వాల్సిందే.!

- లేదంటే డీబార్ చేస్తాం..
- ఇదీ స్క్వాడ్ అధికారుల వ్యవహారం.!

ప్రజాశక్తి-మార్కాపురం

కాపీ కొడుతున్నావా నాయనా.! అయితే రూ.500 ముడుపుగా ఇచ్చుకోవాల్సిందే.! లేని పక్షంలో డీబార్ చేస్తామని స్క్వాడ్ అధికారులు హెచ్చరించడం చర్చనీయాంశంగా మారింది..

మార్కాపురం పట్టణంలోని ఎస్‌వికెపి డిగ్రీ కళాశాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తోంది. సోమవారం కూడా పరీక్ష జరిగింది. ఈ పరీక్ష నిర్వహణలో అత్యధిక భాగం 'చూస్కో.. రాస్కో..' అన్నట్లుగా సాగుతోంది. సోమవారం పరీక్ష జరుగుతుండగా స్క్వాడ్ అధికారులు తనిఖీ నిమిత్తం రావడం జరిగింది. పరీక్ష హాలులో పరీక్షలు రాస్తున్న వారిలో 32 మంది కాపీలుగా పాల్పడగా పట్టుకున్నారు. కొద్ది సమయం తరువాత పట్టుబడిన వారిని డీబార్ చేస్తామని హెచ్చరించారు. ఇంతలో రాయబారం కుదిరింది. కాపీలకు ప్పాలడిన వారిలో ఒక్కొక్కరు రూ.500 చొప్పున వసూలు చేసి ఇవ్వడంతో... తమకు ఏమీ తెలియదన్నట్లుగా అక్కడ నుంచి స్క్వాడ్ అధికారులు జారుకోవడం గమనార్హం.!

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి.. 8లో

డ్యూటీలో ఉండే డాక్టర్ల పేరు, ఫొటోల చార్ట్‌ను ఆసుపత్రిలో ఉంచాలి

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీ చేస్తున్నానని, మరోసారి ఆకస్మికంగా రాత్రి వేళలో తనిఖీ చేస్తానని కలెక్టర్ చెప్పారు. ఆసుపత్రి రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, సదరం సర్టిఫికెట్ల జారీలో ఏమైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

మీరైతే ఇలాంటి భోజనం తింటారా.?

అనంతరం రోగుల కోసం భోజనం తయారుచేస్తున్న వంట గదిలోకి కలెక్టర్ వెళ్లారు. అక్కడ ఉన్న సరుకులు, పాల ప్యాకెట్లు, రాగి పిండి, తదితర వస్తువులను పరిశీలించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి నెలకు గడువు తీరిన ఇప్పటివరకు వాడుకలో ఎందుకు ఉంచారంటూ ప్రశ్నించారు. వెంటనే సరుకులు అందజేస్తున్న గుత్తేదారుడి కాంట్రాక్టును రద్దు చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు. వంటగదిపై పర్యవేక్షణ లోపించడం పట్ల వైద్యుల వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కాలం చెల్లిన వస్తువులతో తయారు చేసిన ఆహారం మీరు తింటారా.? అంటూ ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజమన్నార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సావిత్రి, ఇతర వైద్యులు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎంపీపీ

ప్రజాశక్తి-పొదిలి: మండల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అతిసార మరియు డెంగ్యూ వ్యాధులపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దోమకాటు వల్ల విష జ్వరాలు ప్రబలుతాయని వ్యాధులు రాకముందే జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సీహెచ్ వీరబాబు, నల్లమలపు రుచిత, విద్యాసాగర్, సిహెచ్ ఓ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి వాకా వెంకట రెడ్డి

వాగు కాదు.. రహదారే!

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో అంతర్గత రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షం కురిస్తే వర్షపు నీరంతా రోడ్లపైనే నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. రోడ్లపై నిలిచిన నీరు వారం, పది రోజులు అయినప్పటికీ ఇంకిపోకపోవడంతో కంపు కొడుతున్నాయి. పాదచారులు గత్యంతరం లేక ఆ నీటిలో నుంచే నడిచి రావాల్సి ఉండడంతో కాళ్లకు జిల వస్తోంది. ముఖ్యంగా ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా శివాలయం వీధి, వస్తాద్ వారి వీధి, చైతన్య నగర్‌లలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయితీ పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వాగును తలపిస్తున్న రహదారి

వర్షం కోసం రైతన్నల పడిగాపులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని రైతాంగం వర్షం కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. తమ భూములను దుక్కి దున్ని పంటలు వేసేందుకు సాగుకు సిద్ధం చేసుకున్నారు. అయితే వర్షం కురవకపోవడంతో పంటలు వేయకుండా వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో మండలంలో వెయ్యి హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు. మిరప నారు చల్లుకున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం అసలు వర్షం కురుస్తుందో లేదోనన్న అనుమానంతో రైతన్నలు పంటలు వేయకుండా వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. అదును దాటిన తర్వాత వర్షం కురిసినా ప్రయోజనం ఉండదని వాపోతున్నారు. వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగు చేసుకుందామనుకున్నా భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో చుక్కనీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం, పది రోజుల్లో వర్షాలు కురిస్తే పంటలు సాగు చేసుకుంటామని, లేకుంటే కాడిని పక్కన పడేసి తెలంగాణ ప్రాంతానికి పనులు వెతుక్కుంటూ వలస బాట పట్టక తప్పవని రైతన్నలు వాపోతున్నారు.

దుక్కి దున్ని వదిలేసిన పొలం

పైకప్పు లేని పెట్రోలు బంకు

పెట్రోల్ బంకుల్లో పైకప్పు లేక అవస్థలు

ప్రజాశక్తి-పీసీ పల్లి

మండలంలో ఉన్న రెండు పెట్రోల్ బంకులకు పైకప్పులు లేక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. పెట్రోల్ బంకుల్లో పనిచేసే వారు కూడా ఇబ్బంది పడుతున్నారు. వేసవికాలంలో పెట్రోల్ కొట్టించుకున్నందుకు బంకుల వద్దకు వెళ్లగా ఒకవైపు, పైన తీవ్రమైన ఎండ, మరోవైపు కప్పు లేకపోవడంతో పెట్రోల్ కొట్టించేందుకు ట్యాంకు మూత తీయడంతో ట్యాంక్‌లో ఉన్న పెట్రోల్ ఆవిరి అవుతోంది. పెట్రోల్ కొట్టే సమయంలో కూడా ఎండ ఎక్కువగా ఉండటంతో ట్యాంకర్ లోకి వెళ్లే పెట్రోల్ కూడా ఆవిరి అవుతోంది. వర్షాకాలంలో పై కప్పులు లేకపోవడం వలన వర్షం వచ్చినప్పుడు తడుస్తూ ఉండే పరిస్థితి. పెట్రోల్ కొట్టించుకునే సమయంలో, పైన ఎలాంటి కప్పులు లేకపోవడంతో ట్యాంకుల్లోకి వర్షపు నీరు పోవడం వలన పెట్రోల్ కూడా నీటితో ఉంటుంది. ఈ విధంగా కొంతమేర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా వేసవికాలంలో వర్షాకాలంలో మోటార్ సైకిల్‌లో ట్రాక్టర్లు, వాహనదారులందరూ తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వీరితో పాటు ఒకేసారి ఎక్కువ వాహనాలు వచ్చినప్పుడు పెట్రోల్ కొట్టే కుర్రోళ్లు, కూడా ఎండలో నిలబడి కొట్టాల్సిన పరిస్థితి. పైకప్పులు వుండటం వల్ల ఎంతో మేలు ఉంటుందని వినియోగదారులు, పనిచేసే సిబ్బంది అంటున్నారు. కావున సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పెట్రోల్ బంకుల వద్ద పైకప్పులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, అద్దంకి

O.S. NO: 127/2010

Between

అబ్బూరి లక్ష్మి ....వాది

మరియు

నల్లూరి వీరయ్య & 12 మంది .... ప్రతివాదులు

To

1) అద్దాల శ్రీకాంత్ S/o వెంకటేశ్వర్లు, సాఫ్ట్ వేర్ ఇంజినీర్, గడియపూడి కాలనీ, గుండ్లపల్లి గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

2) అద్దాల సునీల్ S/o వెంకటేశ్వర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, గడియపూడి కాలనీ, గుండ్లపల్లి గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నంబరు దావాలో పై కోర్టు వారు మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకోకుండా ఇబ్బంది కలుగ చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు జారీ అగునట్లుగా పై కోర్టు వారు ఉత్తర్వులు దయచేసినారు. మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తేది:05-08-2024న ఉదయం 10.30 గంటలకు పైకోర్టులో మీరు గానీ, మీ తరపు వకీలు గానీ హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమందు తీర్మానించబడును. తెలుసుకొనేది.

వాయిదా తేదీ : 05-08-2024 ఇట్లు

అద్దంకి అడుసుమల్లి నాగార్జునరావు

తేది : 08-07-2024 వాది తరపు న్యాయవాది

సవరణ

ప్రజాశక్తి దినపత్రిక ప్రకాశం జిల్లా టాబ్లాయిడ్ 2వ పేజీలో తేది 03 - 07 - 2024న ప్రచురితమైన శ్రీ బాలాజీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ పేరుతో వచ్చిన ప్రకటన చెల్లదు అని గమనించగలరు.

'మాగుంట'ను కలిసిన తెలుగు యువత నాయకులు

ప్రజాశక్తి-పొదిలి

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాస రెడ్డిని సోమవారం ఒంగోలు పార్టీ కార్యాలయంలో పొదిలికి చెందిన జిల్లా తెలుగు యువత కార్యదర్శి దామిరెడ్డి అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంటకు దామిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపితో అంజిరెడ్డి

మహారాజశ్రీ మార్కాపురం ఆరవ అదనపు జడ్జివారి కోర్టులో

ఓ.ఎస్. 11/2014

గోగిరెడ్డి నాసరరెడ్డి వగైరా .... వాదులు

వర్సెస్

ఉడుముల వెంగయ్య వగైరా ...... ప్రతివాదులు

కు,

7వ ప్రతివాది: ఉడుముల శ్రీరత్న,
తండ్రి: రమణారెడ్డి

8వ ప్రతివాది: ఉడుముల బేబి జ్యోతిక,
తండ్రి: రమణారెడ్డి

ఇద్దరి నివాసం: వెంకటరెడ్డిపల్లి గ్రామం, పుల్లలచెరువు మండలం, ప్రకాశం జిల్లా.

ఈ నెంబరు వాదులు దావా ప్లెయింట్ పరిహారం రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసినందున ఈ దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనుటకు 18-07-2024వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

ఇట్లు

పురాణం సుబ్రహ్మణ్యం
వాదుల తరపు అడ్వకేట్
మార్కాపురం.

IN THE COURT OF THE ADDITIONAL SEENIOR CIVIL JUDGE COURT. NARASARAOPET.

I.P No: 30/2022

Between:

పాల వెలుగొండా రెడ్డి.. ......పిటీషనర్

And

షేక్. మోతాదు మరియు ఇతరులు.. రెస్పాండెంట్స్.

R.15) నాగిరెడ్డి నాగిరెడ్డి (40 సం॥)
S/o పున్నారెడ్డి (లేటు), చిలకలపల్లి గ్రామం, దొనకొండ మండలం, ప్రకాశం జిల్లా. A.P.

పై నెం.ఐపి నందు రెస్పాండెంట్ R15 అయిన నాగిరెడ్డి నాగిరెడ్డికి అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచడమైనది. ది.30-07-2024 న వాయిదా అయిఉన్నది. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు పైకోర్టు వారు ఎదుట మీరు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా ది.30-07- 2024

ఇట్లు.
పి.చక్రపాణి,
న్యాయవాది,
కె.బి.ఆర్ కాంప్లెక్స్, స్టేషన్ రోడ్,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.
సెల్ నెం : 98856 44203

బహిరంగ ప్రకటన

మా క్లయింట్లు, 1) ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, జమ్ములపాలెం గ్రామ వాస్తవ్యుడు సూదనగుంట వెంకట సుబ్బయ్య కుమారుడు నారాయణరావు, 2) ప్రకాశం జిల్లా, ఒంగోలు పట్టణం గుంటూరు రోడ్ వాస్తవ్యుడు మహమ్మద్ రహిమాన్ కుమారుడు మహమ్మద్ సొహాల్ హమీద్ అను వారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని మంగమూరు గ్రామ కాపురస్తులు చదలవాడ రవీంద్ర బాబు భార్య చదలవాడ వరలక్ష్మి అను వారి నుండి మా క్లయింట్లు విక్రయ ఖరారు అగ్రిమెంటు ద్వారా కొనుగోలు చేసి దరిమిలా ఒంగోలు 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ఒయస్.నెం: 184/2017 దాఖలు చేసి చదలవాడ వరలక్ష్మి గారిపై శ్రీ కోర్టువారి నుండి తేది:11-04-2018న, మా క్లయింట్లు డిక్రీ పొంది యున్నారు. షెడ్యూలు ఆస్తిని కోర్టు వారి తీర్పు ప్రకారము చదలవాడ వరలక్ష్మి మా క్లయింట్లకు విక్రయ దస్తావేజు రిజిష్టర్ చేయవలసియున్నది. షెడ్యూలు ఆస్తి విషయమై పై తెలిపిన కోర్టు తీర్పుకు భిన్నముగా ఎవరైనా ఎలాంటి లావాదేవీలు జరిపినా, క్రయ విక్రయాలు జరిపినా అవి చెల్లనేరవని, షెడ్యూలు ఆస్తిపై చేసే లావాదేవీలు అన్నీ పై తెలిపిన కోర్టు తీర్పుకు విరుద్ధమని చట్ట సమ్మతము కాదని మా క్లయింట్లు ఇందుమూలముగా యావన్మందికీ తెలియ పరచటమైనది.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రేషన్ యిలాకా సంతనూతలపాడు మండలం- మంగమూరు గ్రామ సర్వే నెం.16 లో య.1.54 సెంట్లు మరియు సర్వేనెం.17లో య.1.43 సెంట్లుసర్వే నెం. 18లో య1.08 సెంట్లు వెరసి య.4.05 సెంట్లు ఈ క్రింది హద్దులలో :-

తూర్పు :- మక్కెన కిష్టయ్య ఇతరులకు అమ్మిన భూమి,

దక్షిణం :- మాదాల పద్మ, నల్లూరి సుబ్బారావు మరియు ఇతరుల భూమి

పడమర :- గూడవల్లి శేషమ్మ భూమి,

ఉత్తరం :- డొంక,

ఒంగోలు

తేది : 08-07-2024 ఇట్లు

పంగులూరి గోవిందయ్య
గనిపినేని శ్రీనివాసులు
అడ్వకేట్స్,ఒంగోలు
సెల్ నెం : 9848394222

బహిరంగ ప్రకటన

మా క్లయింట్లు, 1) ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, జమ్ములపాలెం గ్రామ వాస్తవ్యుడు సూదనగుంట వెంకట సుబ్బయ్య కుమారుడు నారాయణరావు, 2) ప్రకాశం జిల్లా, ఒంగోలు పట్టణం గుంటూరు రోడ్ వాస్తవ్యుడు మహమ్మద్ రహిమాన్ కుమారుడు మహమ్మద్ సొహాల్ హమీద్ అను వారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని మంగమూరు గ్రామ కాపురస్థుడు చదలవాడ వెంకటస్వామి కుమారుడు ఆదెయ్య అను వారి నుండి మా క్లయింట్లు విక్రయ ఖరారు అగ్రిమెంటు ద్వారా కొనుగోలు చేసి దరిమిలా ఒంగోలు 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ఒయస్.నెం183/2017 దాఖలు చేసి చదలవాడ ఆదెయ్య గారిపై శ్రీ కోర్టువారి నుండి తేది: 11.04.2018న, మా క్లయింట్లు డిక్రీ పొందియున్నారు. షెడ్యూలు ఆస్తిని కోర్టు వారి తీర్పు ప్రకారము చదలవాడ ఆదెయ్య మా క్లయింట్లకు విక్రయ దస్తావేజు రిజిష్టర్ చేయవలసియున్నది. షెడ్యూలు ఆస్తి విషయమై పై తెలిపిన కోర్టు తీర్పుకు భిన్నముగా ఎవరైనా ఎలాంటి లావాదేవీలు జరిపినా, క్రయ విక్రయాలు జరిపినా అవి చెల్లనేరవని, షెడ్యూలు ఆస్తిపై చేసే లావాదేవీలు అన్నీ పై తెలిపిన కోర్టు తీర్పుకు విరుద్ధమని చట్ట సమ్మతము కాదని మా క్లయింట్లు ఇందుమూలముగా యావన్మందికీ తెలియపరచటమైనది.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రేషన్ యిలాకా సంతనూతలపాడు మండలం- మంగమూరు గ్రామ సర్వే నెం.14/1లో య.2.49 సెంట్లు మరియు సర్వేనెం.15లో య.2.42 1/2 సెంట్లు వెరసి య.4.91 1/2 సెంట్లు ఈ క్రింది హద్దులలో :-

తూర్పు :- బందిలి పద్మరాణి మరియు ఇతరుల భూమి

దక్షిణం :- గూడవల్లి శేషమ్మ భూమి

పడమర :-గూడవల్లి శేషమ్మ మరియు ఇతరుల భూమి

ఉత్తరం :- చదలవాడ వరలక్ష్మి మరియు ఇతరుల భూమి

ఒంగోలు

తేది : 08-07-2024 ఇట్లు

పంగులూరి గోవిందయ్య,
గనిపినేని శ్రీనివాసులు
అడ్వకేట్స్ ఒంగోలు.
సెల్ నెం : 9848394222

మద్యం మత్తులో బావిలో దూకి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మద్యం మత్తులో బావిలో దూకి ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న గ్రామ సచివాలయం సమీపంలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పాలపర్తి కొండయ్య(35) అనే వ్యక్తి ఆదివారం రాత్రి మద్యం తాగాడు. ఈ క్రమంలో ఓ కుక్కను బావిలో పడేశాడు. అనంతరం ఆయన బావిలో దూకాడు. ఈ విషయాన్ని గమనించిన ఆంజనేయులు అనే యువకుడు కొండయ్యను రక్షించేందుకు బావిలో దూకాడు. ఊపిరాడక పోవడంతో రక్షించండంటూ పెద్దగా కేకలు వేశారు. ఈ కేకలు స్థానికులు కొందరు ఆంజనేయులును, కుక్కను బయటకు తీసి రక్షించారు. కొండయ్య అప్పటికే బావిలో అడుగుభాగానికి వెళ్లిపోయాడు. కొండయ్యను రక్షించేందుకు వారు చేసిన కృషి ఫలించలేదు. గ్రామ సర్పంచి దర్శి నాగమణి, గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ తాగునీటి సిబ్బంది మీరా, నాగరాజు మోటర్ ద్వారా బావిలోని నీటిని బయటకు తోడించారు. ఒంగోలు ఫైర్ స్టేషన్ రీడింగ్ ఫైర్ మాన్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది బ్రహ్మయ్య, భరత్ కుమార్, నరసింహారావు, శ్రీహరిరావు, స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌రావు, కానిస్టేబుల్ పవన్ కుమార్ కొండయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. కొండయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మతుడు కొండయ్యకు భార్య కుమారుడు ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

మృతిచెందిన కొండయ్య

మంచినీటికి ఇక్కట్లు

గ్రామంలో ప్రధానమైన మంచినీటి బావి ఇది. బావిలో వ్యక్తి వ్యక్తి మరణించడంతో అందులోని నీటిని వాడేందుకు ప్రజలు ఇష్టపడలేదు. దీంతో గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. ఇప్పటికే గ్రామ పంచాయతీవారు బావిలో బ్లీచింగ్ స్ప్రే చేశారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వర చర్యలు

ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన న్యాయం చేస్తామని ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ వెల్లడించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్)ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ సమస్యలను ధైర్యంగా ఎస్‌పికి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు 75 ఫిర్యాదులను జిల్లా ఎస్‌పి దృష్టికి తెచ్చారు. ఎస్‌పి ఫిర్యాదుదారుల అర్జీలను స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు,జాబ్ మోసాలు, భూ వివాదాలు, ఇతర సమస్యల పై ప్రజలు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై జిల్లా ఎస్‌పి సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి పిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి (క్రైమ్) ఎస్‌వి.శ్రీధర్ రావు, ఐసిసిఆర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ బివి.శివరామకష్ణ, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీ దారుడితో మాట్లాడుతున్న ఎస్‌పి

వైద్యశాలలో తనిఖీ చేస్తున్న ఎంపిపి

వైద్యశాలలో ఎంపిపి తనిఖీ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

వైద్య సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి అన్ని రకాల సేవలు అందించాలని ఎంపిపి గాయం సావిత్రి తెలిపారు. హనుమంతునిపాడు ప్రభుత్వ వైద్యశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిపి సావిత్రి మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా వైద్య సేవలు అందించాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వైద్యశాల ప్రాంగణంలో పిచ్చి చెట్లు, చెత్తాచెదరం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ల్యాబ్‌లోని పరికరాలు, మందులు నిల్వ చేసే రూమును పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున మందులు తెప్పించి నిల్వ చేయాలని అధికారులను ఆదేశించారు. మందుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిపి వెంట హాజీపురం ఉప సర్పంచి వెంకటేశ్వర రెడ్డి ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో పశు సంతతిని పరిరక్షించి మేలు జాతిని పశువులను అభివృద్ధి చేసేందుకు పశు వైద్య సంచార అంబులెన్స్ వాహనంలో 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డ్రైవర్లు (పైలట్ల) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా మేనేజరు ఫీల్డు కోఆర్డనేటర్ ఎం రాజు సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పశువైద్య సంచార అంబులెన్స్ వాహనాలకు డ్రైవరు ఉద్యోగాల భర్తీలో భాగంగా అంబులెన్స్‌లో పైలెట్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులైఉండాలని, హెవీ లైసెన్స్ లేదా బ్యాడ్జి లైసెన్స్ అర్హత కలిగి డ్రైవింగ్‌లో రెండేళ్ల అనుభవం కలిగి ఉండలని అన్నారు. పైన తెలిపిన అర్హత గల అభ్యర్థులు ఈనెల 12న జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి కార్యాలయంలో 1962 కార్యాలయ విభాగంలో జరిగే ఎంపికకు ఆసక్తి గల అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9542571285 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

నూతన భవనాలను వినియోగించాలి

ప్రజాశక్తి-జరుగుమల్లి

నందనవనం గ్రామంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన నూతన భవనాల సముదాయంలో సచివాలయ, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్, మిల్క్ సెంటర్ కార్యకలాపాలు కొనసాగాలని ఆ గ్రామ ఎంపిటిసి మల్లీశ్వరి కోరారు. జరుగుమల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బెల్లం నిర్మల అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మల్లీశ్వరి మాట్లాడుతూ పాత భవనం దూరంగా వుందన్నారు. సచివాలయ సిబ్బందికి ఆ భవనం పూర్తిస్థాయిలో సరిపోదన్నారు. వైస్ ఎంపిపి పులి బిక్షాలు మాట్లాడుతూ జరుగుమల్లి ఎస్‌సి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినట్లు తెలిపారు. ఆభవనంతో ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలిపారు. వెంటనే ఆ భవనాన్ని కూల్చి వేయాలని కోరారు. పిఆర్ ఎఇ కోటా శ్రీహరి మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి వేసేందుకు పాఠశాల విద్యా కమిటీ తీర్మానం తీసుకోవాలని సూచించారు.జరుగుమల్లి మండలం లో 36 ఆర్‌ఒ ప్లాంట్లు ఉన్నట్లు తెలిపారు. ఆ ప్లాంట్లలో నీటి నాణ్యతా ప్రమాణాలు పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్ సచివాలయ కార్యదర్శులను కోరారు. నీటిలో 200 డిటిసి ఉడాలన్నారు.అంతకన్నా తక్కువ ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె. జలజాక్షి, పిఆర్ ఎఇ శ్రీహరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, గృహనిర్మాణ శాఖ ఎఇ అవినాష్, ఆర్‌అండ్‌బి ఎఇ మాధవరావు, పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ జి. రేష్మి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి మల్లీశ్వరి

బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

ఆర్‌టిసి బస్సు డ్రైవర్ తలపై నుంచి వెళ్లిన ఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పుగుండూరు బస్టాండ్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నెగంటి రాఘవమ్మ (85) కనపర్తిలోని తన మనవళ్ళు వద్ద వెళ్లేందుకే బస్సు కోసం బస్టాండ్ వద్దకు వచ్చింది. కొద్ది సేపటి తర్వాత బస్సు వచ్చింది. ఆమె ఎక్కేందుకు ప్రయత్నించగా బస్సు కదిలింది. దీంతో బస్సు తగిలి పడిపోయింది. ఈ విషయాన్ని గమనించని బస్సు డ్రైవర్ బస్సును కదిలించాడు. బస్సు ముందు టైర్ ఆమె తలపై ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును ఆపాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న నాగులుప్పలపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

నగర పంచాయతీ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికుడి పనిచేస్తున్న బత్తుల హనుమంతరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు.హనుమంతరావు మృతదేహాన్ని మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు, శానిటరీ అధికారి కరుణ, సిఐటియు నాయకుడు పూసపాటి వెంకటరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.పద్మ,పి.ఏడుకొండలు, కోటేశ్వరరావు, నరసయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. హనుమంతరావు మట్టి ఖర్చుల నిమిత్తం మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు రూ.15,000 అందజేశారు. అదే విధంగా యూనియన్ తరపున రూ.5,000 అందజేశారు.

బాధితులను విచారిస్తున్న పోలీసులు

ఆగంతకుల ఆగడాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి తూర్పు బైపాస్ సెంటర్ వద్ద ఆగంతకులు రెచ్చిపోతున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాలను ఆపి వారిపై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి తూర్పు బైపాస్ సెంటర్‌లో ఓ యువతి ఏడుస్తూ రాహదారిపై వచ్చి పోయే బైకులను ఆపింది. ఆమె ఎందుకు ఏడుస్తుందని తెలుకొనేందుకు బైకులు ఆపిన వారిపై అగంతకులు కర్రలతో దాడికి ప్రయత్నించారు. ప్రమాదం గ్రహించిన వాహనదారులు అక్కడ నుంచి తప్పించుకొని పోయారు. అనంతరం ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చే లోపు యువతి, అగంతకులు అక్కడ నుంచి ఉడాయించారు. ఆగంతకుల కోసం పరిసర ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ వారి ఆచూకీ లభ్యం కాలేదు. రాత్రి పూట రాకపోకలు సాగించే వాహన చోదకులు గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలు ఆపమంటే, ఆపవద్దని పోలీసులు సూచించారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కొండయ్య

పేదలకు అండగా టిడిపి

ప్రజాశక్తి - చీరాల

పేద ప్రజల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ తెలుగుదేశం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. స్థానిక ముక్కోణంపార్కు సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి, పాలాభిషేకం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.20లక్షల అంబేద్కర్ విదేశీ విద్య పథకం తిరిగి అమలులోకి తీసుకొచ్చిన సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి తెలుగుదేశం పనిచేస్తుందని అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకం ద్వారా రాష్ట్రంలో అనేక మంది పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహంతో పాటు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో హస్తకళల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొడుగుల గంగరాజు, సజ్జా హేమలత, గజవల్లి శ్రీనివాసరావు, కౌతవరపు జనార్దన్, గంజి పురుషోత్తం, కొమ్మనబోయిన రజిని, చంద్ర, నాగమల్లేశ్వరి, జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, నాగేశ్వరరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో యూటీఎఫ్ నాయకులు

యూటీఎఫ్ సభ్యత్వం ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

యుటిఎఫ్ సభ్యత్వ నమోదును మండలంలోని ఐలవరం జెడ్పి ఉన్నత పాఠశాల్లో సోమవారం ప్రారంభించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుకు ఉపాధ్యాయుల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 117 తక్షణమే రద్దుచేయాలని కోరారు. 3, 4 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాల్లో చేసిన విలీనాన్ని నిలిపివేయాలని కోరారు. 1నుండి 5తరగతుల వరకు ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, వి సురేష్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం మాచర్ల మోహనరావు, యోగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం అధ్యక్షునిగా ఈశ్వరబాబు ఎన్నిక

ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రేపల్లె

ఆర్య, వైశ్య సంఘ మండల అధ్యక్షునిగా కాలేపల్లి ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వరబాబు మాట్లాడుతూ ఆర్య వైశ్య సంఘ నాయకులు తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. సంఘ సభ్యులు అందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘ అభివృద్ధికి పాటుపడ తామని స్పష్టం చేశారు. ప్రతి సభ్యునికీ అందుబాటులో వుంటానని అన్నారు. అధ్యక్షుగా ఎన్నికైన ఈశ్వరబాబు ఆర్య వైశ్య సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తూనుకుంట్ల కాశీ విశ్వనాథ గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్

ప్రజాశక్తి - రేపల్లె

దేశ వ్యాప్తంగా జులై10న కార్మికులు కోర్కెల దినోత్సవంలో భాగంగా జరిగే ఆందోళనలను కార్మిక వర్గం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ఎన్నికల అనతరం కార్మికులకు నష్టంచేసే లేబర్ కోడ్ అమలు చేయటానికి ఉత్తర్వులు జారీ చెయ్యటానికి సిద్ధపడుతున్నదని ఆరోపించారు. లేబర్ కోడ్ బిల్లులు అమలు జరిగితే నేడున్న చట్టాల సారమంతా పోతుందని అన్నారు. సమ్మెలు చెయ్యటం కూడా సాధ్యం కాదని అన్నారు. పనివేళలు పెంచడం, ఉన్నహక్కులు తొలగించడం, జీతాలు పెంచకపోవడం, నిర్భంధాన్ని

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు మణిలాల్

తీవ్రతరం చెయ్యడం యజమానులకు తేలిక అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ బిల్లులను అమలు చేయడానికి నిరసనగా కార్మిక హక్కులు సాధించడానికి 'డిమాండ్స్ డే' ని జయప్రదం చెయ్యాలని కోరారు. లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీకరణ పథకంలను ఆపాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామి, మున్సిపాలిటీ, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని అన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేల చొప్పున నిర్ణయించి, ఇతర సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. ఉద్యోగ బద్రత కల్పించాలని అన్నారు. నూతన పెన్షన్ స్కీంను రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడపాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు పట్టణ నాయకులు జె ధర్మరాజు, ఎం వెంకటేశ్వరరావు, కె ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో నిర్మాణ రంగంలో ఉపాధి

ఉచిత ఇసుకను ప్రారంభిస్తున్న ఎంపి, ఎంఎల్ఎ

ఇసుకను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల

ఉచిత ఇసుక పంపిణీ విధానంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. ఎఎంసి యార్డులో శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఉచిత ఇసుక పథకాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఒ గంధం రవీందర్, టిడిపి నాయకులు ముక్కామల శివ, కావూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని, పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక కష్టాలు తీరనున్నాయని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానాన్ని రద్దుచేసి ఉచిత ఇసుక విధానం అమలు చేస్తూ జీఒ విడుదల చేసినట్లు తెలిపారు. వైసిపి పాలనలో నిర్మాణ రంగం కుదేలైందని అన్నారు. ఐదేళ్లపాటు ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడ్డారని పేర్కొన్నారు. ఉచిత విధానం అమలు చేస్తూ జిఒ 43విడుదల చేసినట్లు తెలిపారు.

కొల్లూరు : జువ్వలపాలెం వద్ద ఉన్న ఇసుక రీచ్‌ను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కలెక్టర్ జెవి మురళి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

అద్దంకి : పారదర్శక విధానంతో నాణ్యమైన ఇసుక పంపిణీ చేసేవిధంగా తమ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకువచ్చినట్లు తెలిపారు.

వేమూరు : ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీని సోమవారం అమలులోకి తీసుకొచ్చారని ఎంఎల్ఎ నక్క ఆనందబాబు తెలిపారు. కొల్లూరు మండలం జువ్వలపాలెంలో గత ప్రభుత్వ పాలనలో కొండల మాదిరి ఇసుకను డంపు చేసి ఉంచగా ముందుగా దానిని తరలించేందుకు కలెక్టర్ వెంకట మురళితో కలిసి సోమవారం ప్రారంభించారు. వైసిపి పాలనలో ప్రభుత్వమే ఇసుక అమ్మకాలు చేపట్టి రూ.వేల కోట్లు ఆనాటి ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, నాయకులు దోచుకున్నారని ఆరోపించారు. టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, వేములపల్లి రవి కిరణ్, జనసేన ఇన్‌ఛార్జి ఊస రాజేష్ పాల్గొన్నారు.

కొల్లూరు : సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచనలతో మండలంలోని జువ్వలపాలెం ఇసుక రీచ్ వద్ద స్టాక్ పాయింట్‌ను తెలుగుదేశం మండల అధ్యక్షులు, కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ, లిడిపిల్ మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి రవికిరణ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దారు పుల్లారావు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత బహుజన నాయకులు

యానాదులకు గుర్తింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

అనాదిగా పొలాల్లో, కాలువ కట్టలపై జీవించే సంచార జాతులకు చెందిన యానాదులకు ఆధార్, రేషన్ వంటి గుర్తింపు పత్రాలు కల్పించి ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం చేయాలని డిబిఆర్‌సి కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన యానాదులతో కలసి వినతి పత్రం అందజేశారు. చీరాల ఏరియా కో ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ మాట్లాడుతూ ఈపురుపాలెం కాల్వకట్టపై 35 యానాది కుటుంబాలు నేటికీ ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. దారుల కోటేశ్వరరావు, బాపట్ల ఏరియా కో ఆర్డినేటర్ నూతలపాటి శ్రీలత పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

నేషనల్స్‌కు సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - చీరాల

ఈ నెల 4, 5, 6తేదీల్లో రాజమండ్రిలోని ఫ్యూచర్స్ కిడ్స్ స్కూల్ ఆవరణంలో జరిగిన ఐసిఎస్ఇ ఎపి, తెలంగాణ రీజినల్ బ్యాట్మెంటన్ పోటీల్లో స్థానిక సెయింట్ ఆన్స్ స్కూలు విద్యార్థులు ఐదుగురు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన వై తారకరామ్, చరణ్ తేజ్, ప్రేమ్ కుమార్, విహాన్ జోషి, విపిన్ నిఖిల్ సాయిలను అభినందించారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - రేపల్లె

కాలేజీ వదిలే సమయంలో విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షులు వై నవీన్ డిమాండ్ చేశారు. పట్టణ సీఐ నజీర్ బేగ్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని శ్రీ చైతన్య, నారాయణ, శ్రీరామ, విశాఖ కాలేజీల విద్యార్థులు ర్యాగింగ్ ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాలేజీ వదిలే సమయంలో అల్లరిమూకలు రాష్ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థినీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ర్యాగింగ్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

టిడిపిలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ప్రజాశక్తి - చీరాల

వైసీపీ కౌన్సిలర్లు ఒక్కొక్కరు వైసిపిని వీడి టిడిపిలో చేరుతున్నారు. వారం క్రితం 11మంది కౌన్సిలర్లు ఎంఎల్ఎ కొండయ్య సమక్షంలో చేరగా తాజాగా మరికొందరు టిడిపిలో చేరారు. మాజీ ఎంఎల్ఎ ఆమంచి కృష్ణమోహన్, కరణం బలరామకృష్ణమూర్తి మద్దతు దారులైన కౌన్సిలర్లు యానాదిరావు, యంద్రపాటి కెజియ, షేక్ షాహిద్, చుక్క నాగలక్ష్మి, మించాల సాంబశివరావు, ఎ అరుణ, ఈసర్ల సుజాత, శోభనరెడ్డి, శిరీష, ఎస్ సత్యానందం చేరారు. వీరివెంట కౌన్సిలర్ సూరగాని లక్ష్మి నరసింహరావు దంపతులు, పొత్తూరి సుబ్బయ్య (ఉల్లిపాయలు) పాల్గొన్నారు.

శాలివాహన పురస్కారం గ్రహీత సుబ్బారావుకు సత్కారం

సుబ్బారావుకు పురస్కారం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరుకు చెందిన రచయిత, తెలుగు ఉపాధ్యాయులు మోదుగుల సుబ్బారావుకు శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారం అందజేశారు. హైదరాబాద్ శాలివాహన ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాన్ని అందించి సాలువాతో సత్కరించారు. తెలుగు సాహిత్య రంగంలో చేసిన కృషికి గుర్తుగా అవార్డు లభించినట్లు సుబ్బారావు తెలిపారు. 2023 లో మహాకవి గురజాడ అప్పారావు ఉత్తమ ఉపాధ్యాయ స్ఫూర్తి పురస్కారం (అమెరికా) కూడ లభించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ పేరం సుబ్బారావు అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి
5
మంగళవారం 9 జులై 2024

ప్రకాశం జిల్లా అభివృద్ధికి తోడ్పడండి

ఒంగోలు ఎంపీకి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి వినతి

ఎంపీని కలిసిన లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి సంపూర్ణ తోడ్పాటును అందించాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కోరారు. స్థానిక రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపి కార్యాలయంలో ఎంపి మాగుంటని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్పందించిన ఎంపీ మాగుంట మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివద్ధికి ప్రకాశం జిల్లా అభివద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండవ మురళీకృష్ణ

జంతువుల సంరక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సేవ్ ది అనిమల్ ఫౌండేషన్ చైర్మన్ తాడిపత్రి దివ్య ఆధ్వర్యంలో ఒంగోలు భాగ్యనగర్ నాలుగో లైన్, చివర మోడల్ టౌన్ ఎదురు 'సేవ్ ది యానిమల్ కేర్ సెంటర్'ను ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేర్ సెంటర్‌లో ఉన్న జంతువులకు రాబిన్ వ్యాక్సిన్ వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మురళీకష్ణ మాట్లాడుతూ జంతువుల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, నిర్వాహకురాలు తాటిపర్తి దివ్యకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుపరిపాలన వేదిక నాయకులు లాయర్ చిట్టెం వెంకటేశ్వర్లు, ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, మండవ లావణ్య, జంతు ప్రేమికుడు సికిందర్, సూర్య శ్రీ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్ భాష షహనాజ్, రెడ్ క్రాస్ సభ్యులు మన్నం ప్రసన్నరాజు, కోసూరి శ్రీదేవి, వడ్డెంపూడి సుజాత, వెటర్నరీ హాస్పిటల్ నాగరాజు, తన్నీరు సురేష్‌చౌదరి, డి.శ్రీనివాస్, బొమ్మరిల్లు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్‌వికెపిలో అడ్మిషన్స్ సౌకర్యం కల్పించాలి..

కలెక్టర్‌కు సిపిఎం నేతల వినతి

కలెక్టర్‌కు విన్నవిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళాశాల వైభవోపేతంగా నడిచిన పరిస్థితి నుండి గత ప్రభుత్వ నిర్వాకం వల్ల నేడు కళావిహీనంగా మారిందని, వెంటనే ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ సౌకర్యం కల్పించి కళాశాలను యథావిధిగా నడిపించాలని కోరుతూ కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సిపిఎం నాయకులు దగ్గుపాటి సోమయ్య ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం మార్కాపురం పట్టణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డీకే రఫీ, జవ్వాజి రాజు, పొదిలి మల్లికార్జున, గుమ్మా బాల నాగయ్య, పందిటి రూబెన్, జమ్ముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్యంత ప్రాధాన్యతతో ఫిర్యాదులను పరిష్కరిస్తాం

ఎస్పీ వకుల్‌జిందాల్

ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదిదారులు, తమ సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి సమస్యలు క్షుణంగా విని, రిపోర్టలను పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి.. మాట్లాడి ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించి భాదితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు, ఇతర సమస్యలతో 65 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఇన్స్పెక్టర్ సిహెచ్.సింగయ్య, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పథకాలు ఎప్పటికీ చిరస్మరణీయం

ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలు ఎప్పటికీ చిరస్మరణీయమని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం వైయస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా దర్శిలోని గడియార స్తంభం సెంటర్లో వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అక్కడే కేక్ కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి.. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలలో మండల పార్టీ అధ్యక్షుడు మాజీ ఏఎంసీ చైర్మన్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టేకోట హరీష్, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, పోశం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు

దర్శి మండలంలోని బొట్లపాలెం, తూర్పువీరాయిపాలెం గ్రామాలలో కూడా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని.. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు.

చీమకుర్తి: స్థానిక పోలీసుస్టేషన్ సెంటర్, బూచేపల్లి కల్యాణ మండపం సెంటర్లలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. బూచేపల్లి కల్యాణమండపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలలో జడ్‌పిటిసి వేమా శ్రీను, ఎంపిపి యద్దనపూడి శ్రీను, మండల వైసిపి అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జరుగుమల్లి: జరుగుమల్లిలో వైయస్ఆర్ విగ్రహానికి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పిన్నిక శ్రీనివాసరావు, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, కనపర్తి శేషారెడ్డి, జరుగుమల్లి మాజీ సర్పంచి గడియపూడి హరిబాబు, కళ్ళగుంట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శింగరాయకొండ: వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ శింగరాయకొండ పంచాయతీలోని సుందర్ నగర్ వద్ద, కందుకూరు రోడ్‌లో జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన బాలాజీ నగర్ వద్ద మూలగుంటపాడు గ్రామంలో డాక్టర్ వైయస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాపూరి ప్రభావతి, మాజీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్.పటేల్ పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాళ్లూరులో కూడా జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మార్కాపురం పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గడియారం స్తంభం వద్దగల డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి, తూర్పువీధిలోని వైఎస్ఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకటరాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైసిపి పట్టణ కన్వీనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, ఎపి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలిబేగ్, మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు గుంటక సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం యర్రగొండపాలెం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న ఎరిక్షన్‌బాబు

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టీడీపీ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పథకం అమలు చేస్తున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారిద్దరి చిత్రపటాలకు టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో టిఎన్‌టియూసి నాయకులు, కార్మికులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిఎన్‌టియూసి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ వలీ, నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, ఆతుకూరి క్రిష్టయ్య, షేక్ గఫూర్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, తెలుగు యువత జిల్లా నాయకులు షేక్ వలి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బాల్యవివాహాలు చేయడం ద్వారా కలిగే నష్టాలు, అనర్థాలపై మండలంలోని నరసాయిపాలెం గ్రామంలో సార్డ్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్డ్స్ సంస్థ ఏపిఎం మందా మరియబాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు ప్రోత్సహించే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి బాల చెన్నయ్య, సార్స్ సంస్థ సిబ్బంది గురవయ్య, సుప్రియ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం వైకొత్తపల్లి గ్రామంలోని ఎంపియూపి పాఠశాల నందు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంఈవో పి ఆంజనేయులలు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ పాఠశాలలకు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 2 మల్లూ నాయక్, ప్రధానోపాధ్యాయుడు లాలాజ్యోతి పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు లైసెన్సు పొందాలి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

నర్సరీ యాక్టు ప్రకారం ప్రతి ఒక్క షేడ్ నెట్ నర్సరీ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని లైసెన్సు కలిగి ఉండాలని యర్రగొండపాలెం ఉద్యానశాఖాధికారి పల్లకి ఆదిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పుల్లలచెరువు, రాచకొండ, ఆర్.ఉమ్మడివరం గ్రామాలలో గల షేడ్ నెట్ నర్సరీలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హరిప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నేతలు

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌ని పార్టీ జిల్లా నేతలు సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, జడా బాలనాగేంద్రయాదవ్, ఒంగోలు నగర జనసేన పార్టీ నగర అధ్యక్షులు, 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్, నరేష్ గంధం, భూపతి రమేష్, కోట సుధాకర్ ఉన్నారు.

కాలినడకన కోటప్పకొండ చేరుకున్న టిడిపి కార్యకర్తలు

కోటప్పకొండకు టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి - కారంచేడు

పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు గెలవాలని, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని గతంలో మొక్కుకున్న టిడిపి కార్యకర్తలు ఆ మొక్కు తీర్చుకునేందుకు సోమవారం కాలినడకన కోటప్పకొండకు వెళ్లారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్తలు ఎన్నికలకు ముందు అధికారానికి రావాలని మొక్కకున్నట్లు తెలిపారు. తమ మొక్కు తీరడంతో టిడిపి కార్యకర్తలు ఆదివారం పాదయాత్రగా బయలుదేరి కోటప్పకొండకు సోమవారం చేరుకొని అక్కడ త్రికోటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు బోడాడ హరి, కొల్లా భాస్కర్, గోరంట్ల వెంకటరత్నం, చాగంటి నాయుడమ్మ, నల్లగొర్ల శ్రీరాములు, చాగంటి లక్ష్మీనారాయణ, యార్లగడ్డ ప్రహ్లాదు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ వరప్రసాద్

బీటెక్ విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పంగులూరు

బీటెక్ చదువుతున్న ఇద్దరు విద్యార్థుల చదువు నిమిత్తం రామకూరు చారిటబుల్ ట్రస్ట్ రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. విద్యార్థుల తండ్రి భవనం సిద్ధారెడ్డికి ట్రస్ట్ చైర్మన్ డోరట్ల ఆంజనేయ వరప్రసాద్ చెక్కును సోమవారం అందజేశారు. మండలంలోని కల్లంవారిపాలెంకు చెందిన భవనం అభిరామిరెడ్డి, భవనం భరత్ కుమార్‌రెడ్డి గుజరాత్ రాష్ట్రంలోని పిపి సవాని యూనివర్సిటీలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్నారు. వీరి చదువుకు ఆటంకం లేకుండా ఉండేందుకు రామకూరు చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు చెక్కును విద్యార్థుల తండ్రి సిద్ధారెడ్డికి అందజేశారు.

మీ కోసం వినతులు స్వీకరిస్తున్న తహశీల్దారు

'మీ కోసం' వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం ద్వారా ప్రజలు తమ సమస్యలు పరిష్కరించు కోవాలని తహశీల్దారు బ్రహ్మయ్య కోరారు. ప్రతి సోమవారం తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి ఒక దరఖాస్తు అందినట్లు తెలిపారు. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం ద్వారా త్వరగా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో వచ్చిన సమస్యలను సత్వరం విచారించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎఒ టీ బాలాజీ గంగాధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. మద్దుల సోమశేఖర్ ఫర్టిలైజర్స్‌లో చేపట్టిన తనిఖీల్లో ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రిజిస్టర్లు, విక్రయిస్తున్న కంపెనీల మందులను విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి సిహెచ్ రవికుమార్, రేపల్లె ఎడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేసుకున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర దుకాణాల్లోనూ తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎఒ జి మీరయ్య ఉన్నారు.

రేపల్లె : మండలంలోని తేజ సీడ్స్ సాహితీ ఏజెన్సీస్, నాదెండ్ల నాగేంద్రరావు అండ్ కో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులపై విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారులైన ఎస్ఐ నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి సిహెచ్ రవికుమార్ తనిఖీలు చేసినట్లు ఎఒ ఆర్ విజయబాబు తెలిపారు. స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేసినట్లు తెలిపారు. విత్తనాల కంపెనీలకు సంబంధించిన ఫారం సి లేనందున రూ.లక్ష విలువైన విత్తనాల అమ్మకాలు నిలిపేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎడిఎ సయ్యద్ హుస్సేన్, ఎఒ తిరుమలరావు పాల్గొన్నారు.

నగరం : మండలంలోని సజ్జవారిపాలెం, నగరం గ్రామాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఎస్ఐ జి నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారి సిహెచ్ రవికుమార్ బృందం తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్‌లు పరిశీలించారు. రేపల్లే ఎడిఎ ఎస్‌డి అక్తర్ హుస్సేన్, ఎఒ వి రమేష్ బాబు, టెక్నికల్ ఎఒ ఎ తిరుమలరావు పాల్గొన్నారు

ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

డయేరియా నివారణకు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

డెంగ్యూ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి డయోరియా నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై మలేరియా కార్యాలయ ఆరోగ్య పర్యవేక్షకులు జూగుంట రాంబాబు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి మలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలపై విద్యార్థులతో పాటు పాఠశాల వంట సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. దోమ కాటు వలన వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధులు సోకకుండా నివాస గృహాల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు పెరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దోమతెరలు వాడటం, పరిసరాల పరిశుభ్రత, ప్రతి శుక్రవారం పాఠశాల్లో ఫ్రైడే నీ – డ్రై డేగా పాటించి పరిశుభ్రత పాటించాలని అన్నారు. పాఠశాల్లో విద్యార్థులకు ఏ ఒక్కరికైనా జ్వర లక్షణాలు ఉంటే తక్షణమే సంబంధిత ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తని సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకొని ఉచితంగా వైద్య సేవలు పొందాలని అన్నారు. ఈ నెలలో డయోరియా నియంత్రణ క్యాంపులు నిర్వహించాలని అన్నారు. నీళ్ల విరోచనాల నియంత్రణ పక్షోత్సవ శిబిరాలు రెండు వారాలపాటు వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహించాలని అన్నారు. నీళ్ల విరోచనాలు, అతి సార వ్యాధి (వాంతులు విరేచనాలు), బంక విరేచనాలు, అమీబియాసిస్ సూక్ష్మ పరాన్న జీవి త్రాగే నీటి ద్వారా, తినే ఆహారం కడుపులోకి వెళ్లి అనారోగ్యానికి గురిచేసి జీర్ణ కోశ వ్యాధులు సోకకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని అన్నారు. నీళ్ళ విరేచనాలైతే జింకు మాత్రలు, ఓఆర్ఎస్ ద్రావణం తయారీ, వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు వివరించాలని అన్నారు. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు ఉంచాలని, కాచి చల్లార్చిన నీటిని, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే త్రాగాలని అన్నారు. భోజనానికి ముందు, మల, మూత్రశాలను వాడిన సందర్భాల్లో చేతులు సబ్బుతో శుభ్రపర్చుకొనే పద్ధతులు విద్యార్థులు ఆచరించి అవలంబించే విధానాన్ని విద్యార్థులతో చేయించారు. కాలానుగుణంగా వాతావరణ మార్పులతో ఉత్పన్నమయ్యే కీటక జనీత వ్యాధుల పట్ల విద్యార్థులకు ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డయేరియా నిర్మూలన సబ్ యూనిట్ అధికారి మహమ్మద్ యూసఫ్ షకీల్, ఆరోగ్య కార్యకర్త రమాదేవి, ఆశా కార్యకర్త స్వాతి పాల్గొన్నారు.

డయేరియా అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రతిభ గల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

ప్రజాశక్తి - ముండ్లమూరు

స్థానిక ఆదర్శ పాఠశాల్లో ఇంటర్మీడియట్లో ప్రతిభ చూపిన 20మంది విద్యార్థినీ, విద్యార్థులకు టిడిపి దర్శి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ కడియాల లలిత సాగర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10లక్షల విలువైన ల్యాప్‌ట్యాప్‌లను పేద విద్యార్థులకు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ల్యాప్‌ట్యాప్‌లను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కన్నతల్లిని, జన్మనిచ్చిన ఊరును, చదువుకున్న పాఠశాలను ఏ స్థాయిలో ఉన్న గుర్తుంచుకోవాలని అన్నారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకట్ జిల్లెలమూడి మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలను దత్తత తీసుకొని పాఠశాలకు కావాల్సిన వసతులు కల్పిస్తామని అన్నారు. విద్యార్థులు చదువుకోవడానికి పాఠశాల ప్రాంగణంలో రేకుల షెడ్డు నిర్మిస్తామని అన్నారు. బస్సు సౌకర్యం కొరకు బస్సు షెల్టర్ నిర్మిస్తామని అన్నారు. వాటర్ ప్లాంట్ నిర్మిస్తామని తెలిపారు. జిల్లెలలమూడి వెంకట్ తల్లిదండ్రులైన జిల్లెలమూడి తిరుపతయ్య, గోవిందమ్మను డాక్టర్ లలిత సాగర్ శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. తెలంగాణకు చెందిన కుంచాల శివ అనే విద్యార్థి ఆల్ ఇండియా ఓపెన్ కాంపిటీషన్లో 217వ ర్యాంకు సాధించి బాంబేలో త్రిబుల్ ఐటీ సీటు సాధించారు. ఆ విద్యార్థికి రూ.50వేల నగదును అందించారు. నాలుగేళ్లపాటు చదువుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తానా తెలంగాణ కో ఆర్డినేటర్ బండి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు సుబ్బారావు, అంజిరెడ్డి, నరసింహారెడ్డి, రాముడు, వేము శీను పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న సాగర్

ఎమ్మెల్యే బెదిరించలేదు

రియల్ ఎస్టేట్ వ్యాపారి దిలీప్

ప్రజాశక్తి - చీరాల

స్థిరాస్తి వ్యాపారైన తనను శాసన సభ్యులుగాని, అతని అనుచరులు గాని బెదిరించి ఇబ్బంది పెట్టి స్థలాన్ని తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారం అంతా అవాస్తమని స్థిరాస్తి వ్యాపారి అన్నపురెడ్డి వెంకట దిలీప్ సోమవారం ప్రకటనలో తెలిపారు. స్థిరాస్తి వ్యాపారానికి సంబంధించి వ్యాపార లావాదేవీల్లో భాగంగా తమను వ్యక్తులుగాని, వ్యవస్థలు గాని బెదిరించినట్లుగా తమ వద్ద అయాచితంగా స్థలాన్ని తీసుకున్నారంటూ వచ్చిన వార్తల్లో ఎటువంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే లేక ఆయన అనుచరులు తమను ఇబ్బంది పెట్టి స్థలాన్ని తీసుకున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. దీనికి సంబంధించి శాసన సభ్యులు తాలూకా వ్యక్తులు లోగడనే తమ వద్ద స్థలం కొనుగోలు చేశారని, అందుకు సంబంధించిన నగదు కుడా గతంలోనే చెల్లించారని తెలిపారు. ఈ నేపథ్యంలో బయట జరుగుతున్న ప్రచారం కొందరు వ్యక్తులు లేదా వ్యవస్థలు ఉద్దేశపూర్వకంగా చేసినవే తప్ప ఎటువంటి నిజాలు లేవని తెలిపారు.

10న దేవుని మాన్యం కౌలు వేలం

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 10న పంగులూరు గ్రూపు దేవాలయాలకు చెందిన భూముల కౌలు వేలం జరుగుతుందని కార్యనిర్వహణ అధికారి ఉప్పలమర్తి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మండలంలోని చిన్నమల్లవరంలోని వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన సర్వే నెంబరు 313/2, 327లలోని 8.59ఎకరాల మెట్ట భూమి దేవాలయం వద్ద జరుగుతుందని చెప్పారు. బూదవాడలోని ఊర చెరువుకు చెందిన సర్వే నెంబర్ 52లోని 2.49ఎకరాల మెట్ట భూమికి బూదవాడలోని చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద, జాగర్లమూడివారిపాలెంలోని జాగర్లమూడి రామన్నకుంటకు చెందిన సర్వే నెంబర్ 382/ఏ2లోని 2.15ఎకరాల మెట్ట భూమికి జాగర్లమూడి వారిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద వేలం జరుగుతుందని కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ వేలం పాటలు హిందూ దేవాదాయ శాఖ అధికారుల ఉత్తర్వులకు లోబడి ఉంటుందని చెప్పారు. పాటలో పాల్గొనదలచిన వాళ్లు రూ.3వేలు ధరావత్ చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు. హెచ్చు పాటదారుడు డిపాజిట్ కాకుండా ఒక సంవత్సరం మక్త మొత్తం చెల్లించాలని తెలిపారు. చెల్లించని ఎడల డిపాజిట్ కింద కట్టిన మొత్తాన్ని దేవస్థానం జమ కట్టుకొని మరలా పాట నిర్వహించ బడుతుందని చెప్పారు. దేవాలయంనకు బకాయిలు ఉన్నవారు, లావాదేవీలు ఉన్నవారు, హిందూయేతరులు ఈ పాటలో పాల్గొనటానికి అనర్హులని పేర్కొన్నారు. ఈ పాటల పరిమితి 2024 – 25 నుండి 2026 – 27వరకు ఉంటుందని తెలిపారు. వేలం పాటలు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో కార్యనిర్వహణ అధికారి ద్వారా జరుగుతాయని శ్రీనివాసరావు తెలిపారు.

తహశీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న షేక్ జిలాని

ఎస్ఐ ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి - చీరాల

తెలంగాణ రాష్ట్రం ఆశ్వారావుపేట ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని తహశీల్దారు నాసరయ్యకు దళిత బహుజన పార్టీ అధ్యక్షులు సేక్ జిలాని వినతి పత్రం సోమవారం అందజేశారు. ఎస్ఐ శ్రీనివాసరావుపై ఉన్నత అధికారులతో పాటు కింద స్థాయి సిబ్బంది వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. కులం పేరుతో దూషించి అవమానించారని అన్నారు. అవమాన భారంతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిక్కిలి లావణ్య, రబ్బానీ, బాషా, శ్రీను పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో వైసిపి నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని డిఎంపల్లి, ప్యాడిసన్‌పేట, మూర్తి రక్షణ నగర్ ప్రాంతాల్లో వైఎస్ఆర్ విగ్రహాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఇనగలూరి మాల్యాద్రి, గొర్రెముచ్చు పుష్పరాజ్యం, కేథరిన్ రాజు, జోగి రాజా, కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్ బాబు, ఆట్ల ప్రసాదరెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి : వైసిపి అంటేనే డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైసిపి ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ నగర్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. డాక్టర్ వైఎస్ఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత అని అన్నారు. అనంతరం వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జ్యోతి హనుమంతరావు, బివి కృష్ణారెడ్డి, గుంజి కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

నిజాంపట్నం : పేదల సంక్షేమం కోసం పరితపించిన వ్యక్తి వైఎస్ఆర్ అని వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు ప్రసాదం వాసుదేవా, మరక శ్రీనివాసరావు, మదన్, వైస్ ఎంపీపీ చంటి, ఎంపీటీసీ నాజర్ ఖాన్, సర్పంచ్ పోలేరమ్మ, ఉప సర్పంచ్ మార్కండేయులు, బోటు ఓనర్స్ యూనియన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, నర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కర్లపాలెం : స్థానిక ఐలాండ్ సెంటర్లోని డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆయన జన్మదిన వేడుకలు ఎం సుబ్రమణ్యాం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి, నల్లమోతువారిపాలెం సర్పంచ్ మాడ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. వైఎస్ఆర్ అంటే 108, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్య వంటి పేర్లు శాశ్వతంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయాయని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, మండల కన్వీనర్ ఏడుకొండలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, కాగిత బుల్లయ్య, నాగేశ్వరరెడ్డి, సర్పంచులు నాని, మల్లెల

వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి

ఆదాం, శ్రీనివాసరెడ్డి, కాగిత కరుణకుమారి, ఏడుకొండలు, భాను ప్రసాద్, ఎంపీటీసీ ఆసిఫ్ ఆలీ, లక్ష్మణ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు తాజు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి ఆధ్వర్యంలో అదేపల్లిలో ఇటీవల టిడిపికి చెందిన వాళ్లు వైఎస్ఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన చోటనే 24గంటల్లో మరో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వైసీపీ ఇన్‌ఛార్జి వరికూట అశోక్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ వద్ద జయంతి సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పడమటి శ్రీనివాసరావు, కుందేటి రమేష్, పిచ్చయ్య శాస్త్రి, వేల్పూరి చిన్నారి, వేల్పూరి నాగేశ్వరరావు, మద్దుల గిరి, ఎల్లమంద, కరీం, శెట్టి బాలు, సిరాజుద్దీన్, కౌతరపు శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వైసీపీ ఇన్చార్జి డాక్టర్ గణేష్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గుల్లపల్లిలోని ఈఎస్సార్ మెమోరియల్ వైద్యశాల నందు రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నివాళి అర్పించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళి అర్పించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దేవరపల్లి అమరేంద్ర, కాటూరి కృష్ణయ్య, ఉల్లంఘంట శ్రీరామమూర్తి, తురిమెళ్ళ శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, సంగాబత్తుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొల్లూరు : డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ప్రక్కనున్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, జడ్పిటిసి చొప్పర సుబ్బారావు, బుల్ల నవరత్నం పాల్గొన్నారు.

పంగులూరు : డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని రేణింగవరం, అలవలపాడు, చందలూరు, కొండ మంజులూరు గ్రామాల్లో వైసీపీ ఇన్చార్జి పానెం హనిమిరెడ్డి పాల్గొని డాక్టర్ వైఎస్ఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు స్వయంపు హనుమంతరావు పాల్గొన్నారు.

చీరాల : డాక్టర్ వైఎస్ఆర్ సేవలు మరువ లేనివని వైసిపి నాయకులు అన్నారు. వైసీపీ ఇంచార్జీ కరణం వెంకటేష్ ఆదేశాలు మేరకు స్థానిక గడియార స్థంభం సెంటర్లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, మాజీ ఎంపీపీ గవిని శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, బొడ్డు సుబ్బారావు, టౌన్ అధ్యక్షులు కోండ్రు బాబ్జి, చిలుకోటి శ్రీనివాసరావు, శిఖా సురేష్, బుర్ల సాంబశివరావు, అక్కల శ్రీనివాసరెడ్డి, కావూరి రమణరెడ్డి, పృధ్వీ ధనుంజచ, బిట్రా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కల్వకురి యానదిరావు, చీమకుర్తి బాలకృష్ణ, తోకల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, గోలి జగదీష్, మల్లెల లలితా రాజశేఖర్, శిఖాకోలి వెంకటేశ్వర్లు, యతం మేరీ బాబు పాల్గొన్నారు.

యద్దనపూడి : గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతి సోమవారం నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహనికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి పులగం రజని, వైస్ ఎంపిపి శాంసన్, చంద్, నవీన్, రంగా పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక బొమ్మల సెంటర్లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, ఎంపిపి మేకా ఆనందకుమారి, వైస్ ఎంపిపి పాలేరు వీరయ్య, సర్పంచులు మల్లా అంజమ్మ, బిరుదు నాగేంద్రం, గోపాలం లక్ష్మీదీపక్, కథారి అప్పారావు, కోటా హరిప్రసాద్, గాజుల రమేష్, ముప్పాళ్ల రాఘవయ్య, తులసి శివనాగేశ్వరరావు, దాసరి వెంకట్రావ్, కొసనా రాంప్రసాద్, ఒగ్గిశెట్టి ప్రసాద్, తులసి నాగమణి, కట్టా రత్నరాజు, కూరాకుల ఇస్సాకు, మద్దిరాల శాంతారావు, కంచనపల్లి రమేష్, గేరా స్వరాజ్ కుమార్, మూలంరాజు కుమారస్వామి, కొట్టే ప్రభుదాసు పాల్గొన్నారు.

అక్రమ లే ఔట్లపై అధికారుల కొరడా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

లేఔట్లకు బోర్డులు ఏర్పాటు

మండలంలో 216 జాతీయ రహదారి నిర్మాణంతో రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలను పూడ్చివేసి అక్రమంగా లే ఔట్లకు పూనుకున్నారు. లే ఔట్ నిర్మాణానికి ముందుగా ల్యాండ్ కన్వ ర్జేషన్, తదనంతరం లేఔట్ అనుమతులతో నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నిబంధన ప్రకారం ఎకరాకు పది సెంట్లు చొప్పున గుడి, బడి వంటి ఇతర అవసరాల కోసం స్థలాన్ని పంచాయతీకి అప్పగించాల్సి ఉంది. సిఆర్డిఏ నిబంధనల ప్రకారం లే అవుట్లో రహదారులు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఇవి చేయడానికి సమయంతోపాటు అధిక వ్యయం అవుతుంది. కానీ అక్రమ లేఔట్ నిర్మాణ దారులు ఇలాంటివి వేమీ లేకుండానే భూమిని పూడ్చివేసి దానిలో ప్లాట్లు, రహదారులు విడగొట్టి అధిక మొత్తంలో విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన రెవెన్యూ అధికారులు వీటిని గుర్తించి వాటిపై కొరడా ఝులుపించారు. సూరేపల్లి, ఓలేరు గ్రామాల పరిధిలో 10లేఔట్లపైగా పంచాయతీ అధికారులచే నోటీసు బ్యానర్లు పాతించారు. అనుమతులు లేకుండా వేసిన లేఔట్లలో ప్లాట్లను అమ్మటం, కొనుగోలు చేయటం చట్టారీత్యా నేరమని, అలాంటి సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు.

లబోదిబో మంటున్న కొనుగోలు దారులు

అక్రమ లేఔట్లలో అమ్మకాలు, కొనుగోళ్లు చేపట్టరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్లాట్లకు కొనుగోలు చేసిన వాళ్లు లబో దిబో మంటున్నారు. పూర్తి బాధ్యత తామే తీసుకొని సౌకర్యాలు సిద్ధం చేసిస్తామని చెప్పటంతోనే ప్లాట్లు కొనుగోలు చేశామని వాపోతున్నారు. నమ్మించి తమతో ప్లాట్లు కొనుగోలు చేయించారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి పాలనలో ఏర్పాటు చేసిన ఈ అక్రమ లేఔట్లో పరిస్థితి నూతన ప్రభుత్వంలో ఏవిధంగా ఉంటుందో చూడాల్సి ఉంది.

ట్రాన్స్‌ఫారాలు బిగించి రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి - పంగులూరు

తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మండలంలో ఇటీవల దొంగలు తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫారాలను వెంటనే బిగించి, వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా చేయాలని, రైతులను ఆదుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫారాలకు దొంగలు బెడద ఎక్కువైందని తెలిపారు. దొంగలు పగలగొట్టి తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫారాలను బిగించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. దొంగలు తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా విద్యుత్తు, పోలీసులు సకాలంలో స్పందించడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా 25 ట్రాన్స్‌ఫారాలు దొంగతనానికి గురయ్యాయని అన్నారు. రైతాంగానికి సమస్య తీవ్రంగా మారిందని చెప్పారు. పంగులూరులో నాలుగు, రేణింగవరంలో ఒకటి, కొండమూరులో ఒకటి ట్రాన్స్‌ఫారాలు దొంగలు తీసుకెళ్ళారని అన్నారు. దొంగలు తీసుకెళ్లి మూడు నెలలైనా పోలీసులు ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో ప్రతి రోజు అడుగుతున్న కాలయాపన చేస్తున్నారే తప్ప పనిచేయటం లేదని అన్నారు. విద్యుత్ అధికారులు కూడా రైతుల సమస్యపై స్పందించడం లేదని అన్నారు. ఇప్పుడు వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతుల పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు లేకపోతే పంటలు పండించుకునే పరిస్థితి లేదని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి దొంగలు తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫారాలు వెంటనే బిగించాలని కోరారు. లేకుంటే రైతుల ద్వారా రిలే నిరాహార దీక్షలు కూడా చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం తహశీల్దారు కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు గుడిపాటి మల్లారెడ్డి, పోతుగంటి ఆదం సాహెబ్, నడింపల్లి వెంకటేశ్వర్లు, చిలుకూరి హనుమంతరావు, రాయిని సుబ్బారావు, గొట్టిపాటి శేషాద్రి, బేతాళ జాన్, తొట్టెంపూడి కోటేశ్వరరావు, బండారుపల్లి రామకోటేశ్వరరావు, చిలుకూరి వెంకట్రావు, పాకనాటి కొండారెడ్డి పాల్గొన్నారు.

చనిపోయిన చేపలను చూపిస్తున్న స్థానికులు

కలుషిత నీటితో చేపలు మృత్యువాత.!

ప్రజాశక్తి - చీరాల

కాలువలో చేప పిల్లలు చనిపోయి నీటిలో తేలాడుతూ ఉండడంతో ఆ ప్రాంతంలోని స్థానికులు, కాలవ వెంట ఉన్న పంట పొలాల రైతులు కలవరం చెందిన సంఘటన ఈపురిపాలెం స్ట్రైట్ కట్ రైల్వే బ్రిడ్జి వద్ద వెలుగు చూసింది. దండుబాట నుండి ఈపురుపాలెం కాలవలోకి డ్రైనేజీ వ్యర్థాలతో పాటు ప్రమాదకరమైన కెమికల్ వాటర్ కుడా కలుస్తుంది. అయితే ఆ కలుషిత నీరు ఈపురిపాలెం కాలువ ద్వారా నేరుగా సముద్రంలో చేరుతుంది. కాలువ రైల్వే బ్రిడ్జి వద్ద అనేక చేపలు మృతి చెంది నీటిలో తెలుతున్నాయి. అది గమనించిన అక్కడి నివాసితులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. కారంచేడు నుండి చీరాల వాడరేవు వరకు డ్రైనేజీ వాటర్ మిగులు జలాలును పంపట పొలాలకు తోటవారిపాలెం ఎత్తి పోతల పథకం ద్వారా మళ్లిస్తున్నారు. ఈపురుపాలెం పరిసర భూమిలో గత కొన్నేళ్లుగా చీరాల పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల నుండి డైయ్యింగులు ఏర్పాటు చేశారు. ఇతర రంగుల ఖారా?నాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో ఉపయోగించే విషపూరిత రంగుల రసాయనాలు ఆ కాలువలో కలిసి కలుషితం అవుతున్నాయి. రసాయనాల ధాటికి చిన్న చిన్న చేపలు చనిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. గవివారిపాలెం ఎత్తిపోతల పథకం నుండి పంట పొలాలకు మళ్లిస్తున్న నీటిలో కూడా ఈ విషపూరిత వ్యర్థ పదార్థాలు కలవడంతో ఆ ప్రాంతంలో పంట పొలాలు సరిగా పండక పంట భూములు బీడుగా మారిపోతున్నాయని రైతులు ఆరోపించారు. దండుబాట డ్రైనేజీ కాలువకు ఇరువైపులా ఐక్యనగర్, విజయనగర కాలనీ రైతుల పంట పొలాలు కుడా ఆ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇలాంటి ఘటనల వల్ల తమ పొలాలు కూడా దెబ్బతినే పరిస్థితులు తలెత్తుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆయా ప్రాంతాల రైతులు అనేకసార్లు నీటిపారుదల శాఖ అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఈపురుపాలెం కాలువలో విషపూరిత వ్యర్థ జలాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ ఆధ్వర్యంలో నాగులపాలెంలోని నాగుబడి రంగయ్య, అచ్చుమ్మ బదిరుల పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు, పరీక్ష సామాగ్రి కొమ్మాలపాటి దన్విన్ (దేవరపల్లి) పుట్టినరోజు సంద ర్భంగా క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అందరికీ బోజనాలు ఎర్పాటు చేశారు. దాతల సహాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ ఉమాదేవి, కోమటి ఆంజనే యులు, పంబి సదానందరెడ్డి, నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయ్ భాస్కర్, కొల్లా నరేంద్రకుమార్, కోట శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కారుముడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్పిటల్స్
రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- లేకపోతే చట్టరీత్యా చర్యలు
- డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్ హెచ్చరిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని రక్తపరీక్ష కేంద్రాలు, ఎక్స్‌రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ, డయాగ్నోస్టిక్ కేంద్రాలు, అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ కోరారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు రానున్న 7 రోజులలో చేసుకోవాలన్నారు. అన్ రిజిస్టర్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రి, ల్యాబ్స్, డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ నడిపితే చట్ట పరిధిలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అధికారులు విచారణకు వచ్చినపుడు సరైన ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ సమయంలో సమర్పించిన వైద్యులు, సిబ్బంది విధిగా విధులలో ఉండాలన్నారు. ఈ విషయంలో ఏమైనా మార్పులు ఉన్నట్లయితే రిజిస్ట్రేషన్ అధికారుల అనుమతితో మార్పులు చేయాలన్నారు. తనిఖీ సమయంలో ధృవ పత్రాలు చూపని ఆసుపత్రి, ల్యాబ్స్, డయాగ్నోస్టిక్స్ కేంద్రాలపై చట్టరీత్యా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్‌ఒ హెచ్చరించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి..

- 'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత..
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-మార్కాపురం

అర్జీదారుల సంతృప్తే ప్రామాణికంగా 'మీకోసం' కార్యక్రమం ఉందని, అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. అర్జీలను సహేతుకంగా, సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని మార్కాపురం పట్టణ సమీపంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, అర్జీదారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడారు. 'మీకోసం' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అర్జీదారులను తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలయితే అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయి నుంచి పై స్థాయికి నివేదిక పంపితే, అది ఏ స్థాయిలో ఉన్నదో కూడా తెలుసుకొని వాస్తవ పరిస్థితిని అర్జీదారులకు చెప్పాలని ఆమె స్పష్టం చేశారు. పై అధికారులకు నివేదించాము.. రిపోర్టు వచ్చాక చూస్తాము.. అంటూ మొక్కుబడి, ముక్తసరి సమాధానాలు కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు వ్యవహరించాలని ఆమె దిశా నిర్దేశం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రమూ సహించబోనని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై మొత్తం 487 అర్జీలు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, కనిగిరి ఆర్‌డిఒ జాన్‌ఇర్విన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల అక్రమ తొలగింపులొద్దు..

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు 24 సంవత్సరాల నుండి పని చేస్తున్నారని అటువంటి కార్మికులను ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, రాజకీయ నాయకులు రాజీనామా చేయమని బెదిరింపులకు పాల్పడుతూ.. రాజకీయంగా అక్రమంగా తొలగిస్తున్నారని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్షుణ్ణంగా వినతి పత్రాన్ని చదివి వెంటనే డిఇఒని పిలిచారు. ఈ సమస్యలు పరిశీలించి వీరందరికీ యథావిధిగా ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెయం రఫీ, సిఐటియు నాయకులు జె.నాగరాజు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎం.కొండమ్మ, ఈశ్వరమ్మ, సరోజ, శారద, పి.కొండమ్మ పాల్గొన్నారు.

డిఇఒతో మాట్లాడుతున్న నాయకులు

ఉచితంగా ఇసుకను అందించటమే లక్ష్యం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

ఇసుక పంపిణీని ప్రారంభిస్తున్న దామచర్ల, మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజలకు అవసరమైన ఇసుకను ఉచితంగా అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తెలిపారు. ప్రజలు నిర్మాణ రంగ అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో ప్రజలు ఇసుక కోసం నానా ఇబ్బందులు పడ్డారన్నారు. 2019-2024 కాలంలో ఇసుక మాఫియా కోట్లాది రూపాయలు దోచుకుందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ చర్యలతో నిర్మాణ రంగం కుదేలైందని, ప్రజలు తెలియజేశారు కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోనే ఇసుక పాలసీని తీసుకుని వచ్చి ప్రజలకు ఉచితంగా ఇసుకను అందజేస్తున్నారన్నారు. ఒంగోలులో ఇసుక రీచ్ లేకపోయినా వ్యవసాయ మార్కెట్ కమిటీ, మినీ స్టేడియం రెండు ప్రాంతాలలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసిన ప్రజలకు ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. టన్ను ఇసుక ధర 247 రూపాయలుగా నిర్ణయించామన్నారు. అది కేవలం జెసిబి ద్వారా ఇసుకను లోడ్ చేయడానికి మాత్రమేనని తెలియజేశారు. ఉచిత ఇసుక పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేపడతామన్నారు. ఇసుక సరఫరా చేసే వాహనాలు ఎంత మొత్తంలో రవాణా ఛార్జీలు వసూలు చేసేది త్వరలో నిర్ణయిస్తామన్నారు. ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దామచర్ల హెచ్చరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుకను సరఫరా చేస్తామని, ఎలాంటి ఇబ్బందులున్నా టోల్ ఫ్రీ నెంబర్ 6281799518 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మ్యానిఫెస్టో అంశాలు అమలుకు చర్యలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 రోజులలోనే మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గత ఐదేళ్ళ కాలంలో నిర్మాణ రంగం నిలిచిపోయిందని, 5-6 వేల రూపాయలకు ఇసుక కొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇసుక ధరలు పెరగటంతో నిర్మాణ రంగంపై భారం పడిందని, ప్రజల ఇబ్బందులను గమనించిన సిఎం ఇసుక పాలసీని ప్రకటించారన్నారు. ఇసుక సరఫరాలో స్థానిక సంస్థలకు సీనరేజీ ఇవ్వటం సంతోషమని, తద్వారా అవి అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శింగరాజు రాంబాబు, అయినాబత్తిన ఘనశ్యాం, పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ కండే శ్రీనివాసులు, రాచగర్ల వెంకటరావు, తాతా ప్రసాద్, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, ఒంగోలు ఆర్డీవో జివి సుబ్బారెడ్డి, దుర్గా మల్లేశ్వరి, శేషమ్మ, గనుల శాఖ ఏడీ, నగర ప్రజలు పాల్గొన్నారు.

ఫలితాలు ఘనం..ఉపాధ్యాయులే స్వల్పం..

- సౌకర్యాలు లేక కునారిల్లుతున్న విద్యాలయం
- దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిస్థితి ఇదీ..

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆ పాఠశాల చదువుల్లో ఫస్ట్.. ఉపాధ్యాయుల సంఖ్య మాత్రం అక్కడ తక్కువగా ఉంది. కనీస సౌకర్యాలు లేక కునారిల్లుతోంది. అయినప్పటికీ గత నాలుగేళ్లుగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో ఫస్ట్ ర్యాంకులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. పెద్దదోర్నాలలో 1958లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ పాఠశాల ఉత్తమ బోధనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ఈ పాఠశాలలో ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగులుగా, రాజకీయ నాయకులుగా, వ్యాపారస్తులుగా స్థిరపడ్డారు. అంత ప్రాముఖ్యత కలిగినా ఆ పాఠశాల ప్రస్తుతం జిల్లాలో టాప్-3 స్థాయిలో ఉంది. గతంలో 1400 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 1050 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో చదివే వారంతా నిరుపేదలే..

నాలుగేళ్లుగా మండలంలో మొదటి స్థానం..

మండల వ్యాప్తంగా జరుగుతున్న పరీక్షా ఫలితాల్లో గత నాలుగేళ్లుగా ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులే వరుసగా మండలంలో మొదటి స్థానంలో నిలుస్తున్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి ఫలితాల్లో కూడా స్పందన అనే విద్యార్థిని 584 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధిస్తూ పాఠశాలకు జిల్లా స్థాయిలో మంచిపేరు తీసుకు వస్తున్నారు.

41 మందికి గాను 15 మంది ఉపాధ్యాయులే..

వాస్తవానికి ఆ పాఠశాలకు 41 మంది ఉపాధ్యాయులు అవసరం. అయితే 15 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. తెలుగులో ఐదుగురు ఉపాధ్యాయులకు గాను నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హిందీలో నలుగురికి గాను మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంగ్లీష్‌లో ఐదుకి నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లెక్కలలో ఆరుకి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సైన్స్‌లో ఐదుకి మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సోషల్‌లో ఐదుకి నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీడీ పోస్టులో నాలుగుకి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరత తీర్చండి అంటూ ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా అధికారులు పట్టించుకోలేదు. అయినప్పటికీ ఉన్న 15 మంది ఉపాధ్యాయులే అదనపు పిరియడ్‌లు ఏర్పాటు చేసుకొని క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. దీనికి తోడు జరగనున్న బదిలీల్లో మరికొంత మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లనున్నారు. దీంతో మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికైనా కావాల్సినంత మంది ఉపాధ్యాయులను ఆ పాఠశాలకు ఏర్పాటు చేసి విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించేలా కృషి చేయాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల

విద్యార్థులు చెప్పినట్లు వింటారు..

నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

మా పాఠశాలలో చదివే విద్యార్థులు మేము చెప్పినట్లు వింటారు. చాలా మంచివారు. అదనంగా స్పెడీ క్లాసులు నిర్వహించినా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వస్తారు. చెప్పే ప్రతి విషయాన్ని జాగ్రత్తగా విని అర్థం చేసుకుంటారు. అందువల్లే ప్రతియేటా మా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం..

బి.మస్తాన్‌నాయక్, ఎంఈవో, పెద్దదోర్నాల

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రస్తుతం 15 మంది ఉపాధ్యాయులతోనే పాఠశాలను నడిపిస్తున్నాం.